

చెట్టుకు ఢీకొన్న ఆర్టీసీ బస్సు

– 9 మందికి గాయాలు

విశాలాంధ్ర-పొందూరు: మండలం రెడ్డిపేట (పుల్లాజీపేట) సమీపంలో ఆర్టీసీ బస్సు చెట్టుకు ఢీకొన్న ప్రమాదంలో 9 మంది ప్రయాణీకులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలుమేరకు పాలకొండ నుంచి విశాఖపట్టణం వెళుతున్న ఆర్టీసీబస్సు రెడ్డిపేట సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొంది. ఆకస్మాత్తుగా జరిగిన ప్రమాదంతో ప్రయాణీకులు ఉలికిపాటుకు గురయ్యారు. బస్సు చెట్టును బలంగా ఢీకొనడంతో ముందుబాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో స్వల్పంగా గాయాలైన ప్రయాణీకులను 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్ కు తరలించారు.

నేడు డి.హెచ్.పి.ఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కాశిబుగ్గ రెల్లి వీధిలో గల అంబేద్కర్ భవన్ లో శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం జిల్లా దళిత హక్కుల పోరాట సమితి(డి హెచ్ పి ఎస్) జిల్లా కార్యవర్గ సమావేశం జరుగుతుందని జిల్లా అధ్యక్షులు కోళ్ల చిన్నారావు, ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, కె కైలాష్ లు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్వది సుబ్బారావు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘ కార్యాచరణ, ఎస్సీ ఎస్టీ కేసులపై చర్చిస్తామని తెలిపారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు.

నీటి ఎద్దడి నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

మంత్రి అచ్చెన్న అధికారులకు ఆదేశం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: జిల్లాలో వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షణ అధికారిక చరవాణిలో మాట్లాడి జిల్లా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా నీటి ఎద్దడి ఎదురయ్యే గ్రామాలను గుర్తించి అక్కడ ఉన్న రక్షిత మంచినీటి పథకాలను మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. ప్రధానంగా ఉద్దాన ప్రాంతానికి తాగునీరు అందిస్తున్న ప్రధాన రక్షిత మంచినీటి పథకం పనితీరును మంత్రి అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లాలో ఇతర మండలాల్లో ఉన్న రక్షిత మంచినీటి పథకాలు పనితీరుపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బోరు బావులు మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. తాగునీటి అవసరాలకు నిధులు కొరత లేదని ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ఆకట్టుకున్న కోలాటం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: మండలం గరుడభద్ర గ్రామంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా గౌరీశంకర్ దేవాలయం నుంచి ఊరేగింపు నిర్వహించారు. సైనింగ్ స్టార్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో కోయిద్యాన్సులు, మహిళలచే కోలాటం చూపరులను ఆకటుకున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాల నుంచి జానపద కళలు మరుగున పడకుండా కళలను కాపాడుతూ వస్తున్నారన్నారు. కార్యక్రమంలో సైనింగ్ స్టార్ అధ్యక్షుడు వై.సంతోష్ కుమార్, సి.హెచ్.పాపారావు, గ్రామ సంఘం కమిటీ అధ్యక్షులు కె.మోహనరావు, వై. ఆనందరావు, భాస్కరరావు, వై.ధర్మారావు, ఎ.రమేష్ లు పాల్గొన్నారు.

వత్సవలస యాత్రలో బాణాం యువకుడు అదృశ్యం

విశాలాంధ్ర-పొందూరు: మండలం బాణాం గ్రామానికి చెందిన 19 ఏళ్ళ యువకుడు మాక్క రామప్రసాద్ మూడురోజులక్రితం జరిగిన వత్సవలస యాత్రలో అధృశ్యమయ్యాడు. కుటుంబసభ్యులుతో కలిసి వత్సవలస వెళ్ళిన రామప్రసాద్ కనిపించకుండా పోయాడు. యాత్రలో కుటుంబసభ్యులు రామప్రసాద్కోసం వెతికినా కనిపించలేదు. య వకుడు కొద్దిరోజులుగా మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. యువకుడు అదృశ్యంపై గార, పొందూరు పోలీస్టేషన్లో యువకుడు తండ్రి. రమణ ఫిర్యాదు చేసారు.

బైక్ ను ఢీకొన్న అంబులెన్స్... భర్త దుర్మరణం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలం లోని చిలకపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై గురు వారం జరిగిన ప్రమాదంలో భర్త మృతిచెందగా, భార్య గాయపడింది. ఎస్ఐ వి.సందీప్కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం నగరంలోని మధురానగర్ లో నివాసం ఉంటున్న గార మండలం శ్రీకూర్మం పంచాయతీ బుద్దయ్యగారిపేట గ్రామానికి చెందిన కుందు సూర్యారావు, భార్య సావిత్రి దంపతులు మోటారు ద్విచక్ర వాహనంపై రామతీర్థాలు దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా హైదరాబాద్ నుంచి పశ్చిమబెంగాల్ వెళ్తున్న అంబులెన్స్ వెనుక నుంచి ఢీకొంది. ఈ సంఘటనలో సూర్యారావు (55) అక్కడికక్కడే మృతిచెందగా, భార్య సావిత్రి తీవ్రంగా గాయపడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి హుటాహుటిన చేరుకుని గాయపడిన సావిత్రిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ విప్‌కు ఆహ్వానం



విశాలాంధ్ర-కవిటి: కవిటిలో నూతనంగా నిర్మించిన శ్రీ చంద్రశేఖర ఆలయం మండలం ప్రతిష్ట కార్యక్రమంకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ను ఆలయ కమిటీ పెద్దలు, సర్పంచ్ పూడి. లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం రామయ్యపుట్టుగ ప్రభుత్వ విప్ అశోక్ను కలిసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 9న ప్రతిష్ట కార్యక్రమంలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి. మధు,పొల్లాయి. లక్ష్మణమూర్తి, బెందాళం కామరాజు, వజ్జ రంగారావు,ఏ . తివిక్రమరాజు మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

– జిల్లాలో 94.72 శాతం పోలింగ్

– పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, జేసీ లు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియ ప్రశాతంగా ముగిసింది. జిల్లా లో 31 కేంద్రాల్లో జరిగిన పోలింగ్ లో 94.72 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లు పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ప్రశాంత వాతావరణం లో పోలింగ్ కొనసాగేలా పలు చర్యలు తీసుకున్నారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లో పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పరిశీలించారు. పెద్ద ఎత్తున ఉపాధ్యాయుల పోలింగ్ లో పాల్గొన్నారు. పోలింగ్ ప్రక్రియలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర రావు, ఆర్డీవోలు తదితరులు ఎప్పటికప్పుడు పోలింగ్ ప్రక్రియను పరిశీలించి ప్రశాంత వాతావరణం లో జరిగేలా చర్యలు తీసుకున్నారు.

ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగు సరళిని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్:

- ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగు సరళిని పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు

పోలింగు కేంద్రాలను సందర్శించిన ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి

- కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ లో సీసీ కెమెరా ఫుటేజ్ ను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఓ వెంకటేశ్వరరావు

చక్రతీర్ధసానాలకు సర్వం సన్నద్ధం

ఎస్పీ కలెక్టర్ల పరిశీలన

విశాలాంధ్ర-జలుమూరు: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం శ్రీముఖ లింగంలో కొలువై ఉన్న శ్రీ మధుకేశ్వర స్వామి చక్ర తీర్థ సానాలు శుక్రవారం జరుపుటకు సర్వం సన్నద్ధం చేశారు శుక్రవారం 12 గంటల పైబడి అమావాస్య అనంతరం పాడ్యియమి గడియల్లో దేవుడు చక్రతీర్థ సాన్నాళ్లకు బయలుదేరుతుందని దేవదయ శాఖ తెలిపింది స్వామి వారి దక్షిణ ద్వారం గుండా ప్రధాన వీధి నుండి మిర్యాలపల్లి వంశధార నది తీరంలో స్వామివారి చక్ర తీర్థ స్నానం జరుగుతుందని అర్చకులు తెలిపారు భారీ భద్రత మధ్య స్వామివారు నంది వాహనంపై శివ పార్వతి ఉత్సవ విగ్రహాలు నదీ తీరానికి చేరుతాయని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి పరిశీలనలో టెక్కలి డిఎస్పి మూర్తి ఆధ్వర్యంలో నరసన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని డిఎస్పి మూర్తి తెలిపారు తెల్లవారుజామున స్వామివారి తలుపులు తెరిచిన వెంటనే వంశపారంపర్యం ధర్మకర్త పర్లాకిమిడి మహారాణి వారి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కలుగుతుందని వారు తెలిపారు పలు ప్రాంతాల నుండి శ్రీముఖలింగం చేరుకునేందుకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందని టు డిపో మేనేజర్ శర్మ తెలిపారు టెక్కలి నుండి కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆ డిపో మేనేజర్ తెలిపారు భక్తులకు ఎటువంటి అనారోగ్య పరిస్థితులు ఎదురవకుండా అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు సోమవారం నదిలో స్నానం కి వెళ్లే సమయంలో భారీ బార్కెట్స్ ని ఏర్పాటు చేశారు కూడా భారీ భద్రత ఏర్పాట్లు చేపట్టినట్లు డిఎస్పీ తెలిపారు పారిశుద్ధ కార్యక్రమాలను పంచాయతీరాజ్ శాఖ వారు నిర్వహించారు.

ఫ్లెక్సీలు తొలగించిన అధికారులు

విశాలాంధ్ర ఎఫెక్ట్ (స్పందన)

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలో రావివలస గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా ఎండల మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో హీరోయిన్ చిత్రాలతో ఫ్లెక్సీ ని ఏర్పాటు చేసిన విషయం అందరికీ తెలిసినదే. అయితే బుధవారం విశాలాంధ్ర పత్రికలో ఆలయ ప్రాంగణంలో అనవసర ఫ్లెక్సీలు అనే వచ్చిన కథనానికి గురువారం దేవాదయశాఖ అధికారి జి గురునాధరావు స్పందించారు. విశాలాంధ్ర కథనానికి వివరణ ఇస్తూ సదరు ఫ్లెక్సీ ని ఉత్సవం బిజీలో అంతగా పరిశీలించలేకపోయామని, బుధవారం ఉదయం భక్తులు క్యూ లైన్ లో సక్రమంగా వెళుతున్నారో లేదో చూడడానికి వెళ్లే సమయంలో చూడటం జరిగిందని, వెంటనే సదురు యాజమాన్యం వారిని ఫోన్ చేసి ఫ్లెక్సీని తొలగించవలసిందిగా తెలిపేమని తెలిపారు. లేని పక్షంలో మీపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేసినట్లు జి గురునాథరావు వివరణ తెలిపారు. గత సంవత్సరము లాగే ఈ సంవత్సరం కూడా అనుమతి తీసుకోవాలని తెలియక గతంలో ఏర్పాటు చేసినట్లే ఈ సంవత్సరం కూడా ఏర్పాటు చేయడం జరిగిందని మీరు చెప్పిన వెంటనే మా వర్కర్స్ తో దేవాలయం బయట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ని తీసివేయడం జరిగిందని సుగుణ లైఫ్ స్టైల్ మేనేజింగ్ పార్ట్నర్ డి రమేష్ తెలిపినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు పర్యవేక్షించిన ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర-నరసన్నపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి పోలీసు అధికారులతో చర్చించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పర్యవేక్షించారు. బుధవారం ఉదయాన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరంలో కూర్చొని, ఎన్నికలు జరిగే విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయితీ వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, టిడిపి నాయకులు, కింజరాపు రామారావు, గొద్దు చిట్టిబాబు, బోయిన సతీష్, శిమ్మ చంద్రశేఖర్, సరిపల్లి మధు, పూణ్ణ కళ్యాణ్‌కుమార్(అనిల్), బలగ ప్రహర్షకుమార్, అడపా చంద్రశేఖర్, బతకల గోపి, వారణాశి రమేష్, ఉపాధ్యాయ యూనియన్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి సన్నిధిలో తమ్మినేని...

విశాలాంధ్ర- ఆమ దాలవలస: కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి వారిని కుటుంబ సమేతంగా గురువారం దర్శించు కున్నారు. తన తల్లి మాజీ ఎంపీపీ తమ్మినేని భారతమ్మ, సోదరి తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ప్రజలకు మంచి చేకూరాలని, స్వామివారిని కోరుకున్నట్టు చంద్రశేఖర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-ఆముదాలవలస: ఆముదాలవలస పురపాలక సంఘం పరిధి సొట్ట వానిపేట గ్రామం వద్ద ఉన్న 33/11 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ మెట్టెక్కివలస టౌన్-2 ఫీడర్, పరిధిలో లైన్లు మరమ్మతులు చెట్లు కొమ్మలు తొలగింపు కార్యక్రమం శుక్రవారం చేపట్టనున్నందున మెట్టక్కివలస, అమ్మ నగర్, కుప్పిలి వారివీధి, ఊసవా నిపేట, పురపాలక సంఘానికి తాగునీరు అందించే అలమాజీపేట పంపు హౌస్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉదయం 8 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిలిచిపోనున్నందున వినియో గదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని ఆ శాఖ ఉన్నత అధికారుల ఆదేశాలు మేరకు స్థానిక అర్బన్ ఏ ఈ రామారావు ప్రకటనలో తెలిపారు.

ఎచ్చెర్లలో 92.94 శాతం పోలింగ్

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: "ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ఎచ్చెర్ల మండలానికి సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో గురువారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 170 మంది ఓటర్లకు గాను 158 మంది ఓటు హక్కును వినియోగించుకోవడడంతో 92.94 శాతం నమోదైంది. ఓటు వినియోంచుకున్నవారిలో 106 మంది పురుషులు, 52 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. జిల్లా = కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఆర్డీవో సాయి ప్రత్యూష పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కూటమి ప్రభుత్వం బలపర్చిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మ తరపున కూటమి నేతలు, ఏపీటీఎఫ్ ప్రతినిధులు ప్రత్యేకంగా కేంపైన్ నిర్వహించారు. అలాగే యూటీఎఫ్, పీఆర్టీయూ ప్రతినిధులు వేర్వేరుగా కేంపైన్ నిర్వహించారు.

అప్పులభారంతో ఖాజీపేటలో యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర-పొందూరు: మండలం ఖాజీపేటకు చెందిన పల్ల లక్ష్మణరావు (45) బుధవారం రాత్రి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గ్రామంలో విసాదం నింపింది. మహాశివరాత్రి పర్వదినాన ఈ ఘటన చోటుచేసుకోవడంతో కుటుం బసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి తండ్రి పొందూరు పోలీసులకు ఫిర్యాదు చేసారు. పొందూరు పోలీసుల సమాచారం మేరకు పెయింటర్‌గా పనిచేస్తున్న లక్ష్మణరావు కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. అప్పులచారం పెరిగిపోవడంతో బుధవారం రాత్రి గ్రామంలో ఉన్న బావిలో దూకాడు బావిలో ఉన్న రాయి తలకు బలంగా తగిలింది. గ్రామస్తులు లక్ష్మణరావును బయటకు తీసినప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇదరు పిల్లలు ఉన్నారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసిన పోలీసులు శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ కు తరలించారు.

టిడిపి సభ్యత్వ కార్డులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే, బగ్గు



విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను నాయకులకు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ ఇంఛార్జ్‌లు, యూనిట్, క్లస్టర్ ఇంఛార్జ్‌లు, గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహవంతంగా పాల్గొని, నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల్లో సుమారు 52,000సభ్యత్వాలు చేసినందుకు అభినందనలు తెలియచేశారు. అలాగే గ్రామాల్లో. పట్టణాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా టిడిపి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా ఇంఛార్జ్, బగ్గు అర్చన, మేజర్ పంచాయితీ వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, టిడిపి నాయకులు, శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు రామారావు, బోయిన సతీష్, గొద్దు చిట్టిబాబు, అడపా చంద్రశేఖర్, గొలివి రామారావు, బతకల గోపి, చలపాక మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బారువలో రిటైర్డ్ ఉద్యోగులకు ఘన సన్మానం



విశాలాంధ్ర-సోంపేట: ఈ మండలం బారువ గ్రామం లో శ్రీశయన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక రిటైర్డ్ ఉద్యోగస్తులను ఘనంగా సన్మానించారు. శ్రీశయన సామాజికవర్గానికి చెందిన దూగాన జోగారావు, సిందిరి కేశవరావు, సిందిరి పాపారావు, తుంగాన భువనేశ్వర్, లొట్ల దేవరాజులను దంపతులతో సహా దుశ్శాలువలు కప్పి జ్ఞాపికలు అందించి సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా దశాబ్దాలుగా విధులు నిర్వహించి పదవీ విరమణ చెందిన ఉద్యోగులు భవిష్యత్తు ప్రశాంతంగా గడిపేందుకు తగు చర్యలు తీసుకోవాలని సంఘ అధ్యక్షుడు చొక్కల తిరుమలరావు, కార్యదర్శి లొట్ల నాగరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవీ విరమణ చెందిన వారు మీ అనుభవాలతో శ్రీశయన యువతకు స్ఫూర్తిగా నిలవాలని వారి అభ్యున్నతికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బారువ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన

విశాలాంధ్ర-సోంపేట: ఈ మండలం బారువ పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం సాయంత్రం బారువ కొత్తూరు గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. రెండు రోజుల క్రితం కొత్తూరు గ్రామానికి చెందిన పీహెచ్‌సి ఉద్యోగిని వలిశెట్టి తులసి ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో అందుకు బట్టిగళ్లూరు పిహెచ్‌సిలో పని చేస్తున్న తోటి ఉద్యోగి మజ్జి ప్రదీప్ కారణమని మృతురాలి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న విషయం తెల్సిందే. రెండు రోజులు గడచినా ప్రదీప్‌ను ఇంత వరకు పోలీసులు కస్టడిలోకి తీసుకోలేదని అసలు ఎటువంటి విచారణ జరపలేదని ఆగ్రహిస్తూ పెద్దసంఖ్యలో గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌ను చుట్టుముట్టారు. ఇటువంటి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రదీప్ స్వేచ్ఛగా తిరుగుతున్నాడని ఆయనను ఎందుకు కస్టడీలోకి తీసుకోలేదని ఎస్సై హరిబాబునాయుడును ప్రశ్నించారు. సున్నితమైన ఈ కేసులో పోలీసులు అలసత్వం వహిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై ఎస్సై స్పందిస్తూ ఈ కేసుకు సంబంధించి 306 సెక్షన్ ప్రకారం దర్యాప్తు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం ఆధారాలు సేకరిస్తున్నామని ఇద్దరి మధ్య ఉన్న సంబంధాలు, వ్యవహారాలకు ఆధారాలు లభించిన వెంటనే ప్రదీప్‌ను కస్టడీలోకి తీసుకుని చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సుమారు గంట సేపు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు.

ఎమ్మెల్సీ ఓటర్ల స్లిప్పులు అందచేసిన నియోజకవర్గ ఇంఛార్జ్, బగ్గు అర్చన



విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పి.జి కళాశాలలో బుధవారం నిర్వహించిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి కుమార్తె, నియోజకవర్గ సోషల్ మీడియా ఇంఛార్జ్, బగ్గు అర్చన పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉపాధ్యాయ యూనియన్ ఏర్పాటు చేసిన శిబిరంలో ఆమె పాల్గొని, పట్టభద్రులకు ఓటు స్లిప్పులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయితీ వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, టిడిపి నాయకులు, సరిపల్లి మధు, అడపా చంద్రశేఖర్, శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, బోయిన సతీష్, కింజరాపు రామారావు, పూణ్ణ కళ్యాణ్ కుమార్(అనిల్), వారణాశి రమేష్, బలగ ప్రహర్షకుమార్, బతకల గోపి, కిళ్ళాం మోహన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రశాంతం

సంతబొమ్మాలి లో 99% ఎమ్మెల్సీ ఓట్లు పోలింగ్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా, గురువారం సంతబొమ్మాళి ఎం పి యు పి పాఠశాలలో కేంద్రంలో జరిగిన ఉపాధ్యాయుల ఓటింగ్ పోలింగ్లో 99 శాతం ఓట్లు పోలయ్యాయి. ఇందులో భాగంగా సంతబొమ్మాలి ఎస్సై, వై. సింహాచలం ఆధ్వర్యంలో స్పాడ్ టీం తో పాటు పోలీసులను బందోబస్తు నిర్వహించారు. అలాగే టెక్కలి ఆర్డిఓ కృష్ణమూర్తి పోలింగ్ స్టేషను పరిశీలించారు. సంతబొమ్మాలి ఎంపీడీవో జయంతి ప్రసాద్ సైతం పోలింగ్‌స్టేషను పర్యవేక్షించారు. పాకలపాటి రఘు వరన్ కు మద్దతుగా టిడిపి నాయకులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, కూచెట్టి కాంతారావు, మెండ అప్పారావు, సూరాడ దాసురాజు, శవ్వాన ప్రసాదరావు, అల్లు రమేష్, సిమ్మ గోవిందరావు, గూట్ల మల్లేశ్వరరావు తో పటు పలువురు టిడిపి నాయకులు శిబిరాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. అలాగే ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రశాంతం

విశాలాంధ్ర-హిరమండలం: గురువారం హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రశాంతం గా నిర్వహించుకున్నామని తహసీల్దార్ఎన్ హనుమంత్ రావు విలేకరులకు తెలిపారు. మండలం లోని 70 మందికి గాను 65 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించు కున్నట్లు తెలిపారు. కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్ స్థానిక ఎస్సై ఎం డి యాసిన్ పోలీస్ సిబ్బంది బందోబస్త్ నిర్వహించి ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు జరుగ కుండా ప్రశాంతం గా నిర్వహించుకున్నామన్నారు.. రెవిన్యూ అధికారులు డిప్యుటీ తహసీల్దార్ కే బాలకృష్ణ, ఆర్ ఐ, వి ఆర్ ఓ లు అందరు సహకారం తో ఈ ఎమ్మెల్సీ ఓటుంగ్ ను ప్రశాంతం గా నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు.

టెక్కలిలో ముగిసిన పోలింగ్



విశాలాంధ్ర-టెక్కలి: మండలంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని డివిజనల్ రెవెన్యూ అధికారి ఎం కృష్ణమూర్తి పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రశాంతంగా ముగిసేలా చూడాలని అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రంలో 254 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా సాయంత్రం 4 గంటల వరకు 218 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆర్డీవో తెలిపారు. వీరిలో 167 పురుషులు, 87 స్త్రీలు ఉన్నట్లు తెలియజేశారు.

పొందూరులో ప్రశాంతంగా ఎన్నికలు

విశాలాంధ్ర-పొందూరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్సీ ఎన్నికలలోబాగంగా మండలంలో ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలకేంద్రం పొందూరు ఎం.పీపీ-2 పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్బూత్లో ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు మండలంలో 190 ఓట్లు ఉండగా 132 ఓట్లు పోలయ్యా యి పోలీసులు పోలింగ్ బూత్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేసారు మండలకేంద్రంలో పార్కు సమీపంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో



చేసిన టెంటును పీయూసీ చైర్మన్ కూన రవికుమార్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పరిశీలించారు. ఎస్ ఐ సత్యనారాయణ ఎటువంటి గోడవలు తగాదాలు లేకుండా ఏర్పాట్లు చేసాయి.

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో గురువారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలానికి చెందిన ఉపాధ్యాయ ఓటర్లు పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 176 ఓట్లుకు గాను 172 ఓట్లు పోలయ్యాయి. స్థానిక తహశీల్దార్ బి.అప్పలస్వామి పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. పోటీలో ఉన్న ప్రధాన అభ్యర్థులకు సంబంధించి మెయిన్‌రోడ్డులో ఆయా సంఘాలకు చెందిన ఉపాధ్యాయులు ఎన్నికల శిబిరాలను నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: కోటబొమ్మాళి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. 112 ఓట్లుకు గాను 107 ఓట్లు పోలయ్యాయని ప్రిసైడిరగ్ అధికారి (పీవో) ఏ. ప్రభాకర్ తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 4 గంటలతో ముగిసిందని ఆయన తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్ఐ వి. సత్యన్నారాయణ తన సిబ్బందితో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిలో సర్వేస్‌రోడ్డులో ఏపీటీఎఫ్, యుటీఎఫ్, పీఆర్‌టీయు మరియు తెలుగుదేశం శ్రేణులు వేరువేరు శిబిరాలను ఏర్పాటు చేశారు.

చంద్రమ్మకు కృత్రిమ అవయవాలు ఏర్పాటు చేసిన ట్రస్ట్‌లు

విశాలాంధ్ర-నరసన్నపేట: నియోజకవర్గంలోని పోలాకి మండలం అంపలాం గ్రామానికి చెందిన ఇప్పిలి చంద్రమ్మకు సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి, బ్రైటర్ ఫ్యూచర్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఉమ్మడిగా కృత్రిమ అవయవాలందించాయి. గత కొన్నేళ్ళుగా చంద్రమ్మ తీవ్ర అనారోగ్యంతో(లెప్రసీ) ఇబ్బందులు పడుతూ ఉంది. తన రెండు కాళ్ళను కోల్పోయి, దీనావస్థలో బాధపడుతుంటే కృత్రిమంగా రెండు కాళ్ళు అమర్చి, ఆమె ఖర్చుల కోసం ఆర్థిక సహాయమందించారు. ఈ విషయమై చంద్రమ్మ మాట్లాడుతూ కృత్రిమ అవయవాలు ఏర్పాటు చేయటం వలన ఆనందంగా ఉన్నానని, ఇటువంటి మంచి కార్యక్రమానికి సహాయ, సహాకారం అందించిన సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి, బ్రైటర్ ఫ్యూచర్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కో-ఆర్డినేటర్, వేంకటేశ్వరరావుకు ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డా.బ్రహ్మం, రేవాడ త్రినాధరావు మాస్టర్, రఘు, వేంకటేశ్వరరావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్, రెవెన్యూ పర్యవేక్షణలో ఎమ్మెల్సీ ఎన్నికలు

విశాలాంధ్ర-నరసన్నపేట: నియోజకవర్గంలోని గురువారం జరిగిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పోలీస్, రెవెన్యూ శాఖల పర్యవేక్షణలో జరిగాయి. నరసన్నపేట పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ, పిజి కళాశాలలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో పట్టభద్రులైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 200ఓట్లుకు గాను 192ఓట్లు నమోదయ్యాయని ఎన్నికల అధికారులు తెలియచేశారు. ఎన్నికలు జరుగుతున్న సమయంలో తహశీల్థార్, టి.సత్యన్నారాయణ ఎన్నికలు జరగుతున్న తీరును పరిశీలించి, పోలీసు అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అంతేకాక సి.ఐ, జె.శ్రీనివాసరావు, ఎస్.ఐ, సిహెచ్.దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసుల బృందం పటిష్ఠ చర్యలు తీసుకుంది. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

విశాలాంధ్ర-కవిటి: మండల కేంద్రమైన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మొత్తం ఓట్లు 94 ఓట్లు గాను మహిళలు 31, పురుషులు 63 గాను 85 ఓట్లు పోలైనట్లు ఇన్చార్జి తాసిల్దార్ ఎం.కృష్ణమూర్తి తెలిపారు. అందులో మహిళలు 27, పురుషులు58 ఓట్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు.ఎస్సై వి. రవివర్మ మరియు పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

ఎండల మల్లన్న హుండీ లెక్కింపు

విశాలాంధ-టెక్కలి: టెక్కలి మండలం రావివలస గ్రామంలో వెలిసియున్న శ్రీశ్రీశ్రీ ఎండల మల్లిఖార్జున స్వామి వారి దేవస్థానంనకు మహాశివరాత్రి మహోత్సవంలో భాగంగా గురువారం టి.పి.మనస్వి కార్యనిర్వహణాధికారిని, గ్రూప్ దేవాలయం టెక్కలి ఆధ్వర్యంలో హుండీ తెరవడం జరిగింది. దేవస్థానం నకు శాశ్వత హుండీలు - 2 , 95 రోజులుకు గాను మరియు తాత్కాలిక హుండీలు - 9 ఒక రోజుకు గాను 4,20,512/- హుండీ ఆదాయం వచ్చిందని, అలానే టికెట్స్ ద్వారా 5,02,820 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. అయితే మొత్తం 9,23,332/- ఆదాయం వచ్చిందని,గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 2,54,752/- ఆదాయం పెరిగినదినీ ఆలయ ఈవో జి.గురునాథరావు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఎల్.ఎల్.నాయుడు ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

విశాలాంధ్ర-కంచిలి: కంచిలి మండలంలో ప్రశాంతంగా ఎన్నికలు ముగిసాయి. పోలింగ్ కేంద్రం 9లో జరిగిన ఎన్నికల్లో మొత్తం ఉపాధ్యాయ, అధ్యాపక 89 ఓటర్లు ఉండగా పురుషులు 56,మహిళ ఓటర్లు 27 మంది మొత్తం 83 ఓట్లు నమోదు అయినట్టు తాశిల్దార్ రమేష్ తెలిపారు. మెత్తం 96 శాతం నమోదు కాగా బాలన్స్ 6 ఓట్లు ఉన్నట్టు తెలిపారు.

అన్నెపు లోకేష్ మృతితో చినరావుపల్లిలో విషాధం

- మృతిపై నిజానిజాలు బయటపెట్టాలని తల్లిదండ్రుల డిమాండ్

విశాలాంధ్ర - ఎచ్చెర్ల: మండలంలోని చినరావుపల్లి గ్రామానికి చెందిన అన్నెపు లోకేష్ (18) విజయనగరంలో మృతి చెందడంతో స్వగ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అన్నెపు గణేష్, అమ్మాజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, ఇందులో పెద్దవాడు సంతోష్, రెండోవాడు లోకేష్ తండ్రి గణేష్ తాపీపని, తల్లి అమ్మాజమ్మ కూలిపనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకువస్తున్నారు. చిన్న కుమారుడైన లోకేష్కు మంచి భవిష్యత్ ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో ఇంటర్మీడియట్ నుంచి హాస్టల్లో ఉంచి చదివిస్తున్నారు. విజయనగరంలో లోకేష్ స్నేహితులతో కలిసి రూమ్లో ఉంటూ ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతూనే మరోవైపు ఫిజికల్ ఫిటినెస్తో పాటు, కాంపిటేటివ్ పరీక్షలకు కోచింగ్ కూడా తీసుకుంటున్నాడు. ఇదిలావుండగా, ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో అన్నయ్య సంతోష్‌కుమార్ తమ్ముడు లోకేష్ ఉరిపోసుకుని చనిపోయాడని స్నేహితుల నుంచి ఫోన్ వచ్చింది. అయితే తన కుమారుడు లోకేష్ ఆత్మహత్య చేసుకునేటంత పిరికివాడు కాదని, దీనిపై నిజానిజాలు బయటకు తీయాలని తల్లిదండ్రులు గణేష్, అమ్మాజమ్మలు డిమాండ్ చేస్తున్నారు. లోకేష్ మరణాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న తన కొడుకు తిరిగి రాని లోకాలకు వెళ్లాడని తలచుకుని తల్లిదండ్రులు గుండెలు పిండేలా రోదిస్తున్నారు. మరణం వెనుక ఉన్న మిస్టరీని ఛేదించాలని లోకేష్ తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు. గురువారం స్వ గ్రామమైన చినరావుపల్లిలో గురువారం లోకేష్ అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రభుత్వానికి ధీటుగా స్వచ్ఛంద సంస్థల సేవలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: ప్రభుత్వాలతో సమాంతరంగా సామాజిక సేవలు అందించే సామర్థ్యం ఒక్క స్వచ్ఛంద సంస్థలకు మాత్రమే ఉన్నాయని, అనేక దేశాల్లో ప్రభుత్వాలకు సమాంతరంగా సేవలు అందించే ఘనత ఎన్‌జీఓలదేనని శ్రీకాకుళం నగరానికి చెందిన స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. గురువారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రపంచ ఎన్‌జీఓల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ప్రగతిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర గూర్చి సీనియర్ జర్నలిస్ట్, రాష్ట్ర జర్నలిస్టుల ఫోరం కార్యదర్శి శాసపు జోగినాయుడు వివరించారు. అనంతరం స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, బీవీ. రవిశంకర్, వీజీ గుప్తా లు మాట్లాడుతూ సమాజమే దేవాలయంగా బావించి ఆరోగ్య సమాజ నిర్మాణానికి బాటలు వేసే అవకాశం వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలకు దక్కుతాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వేతర సంస్థల కీలక కృషిని గుర్తించి సముచిత రీతిలో గౌరవించడానికి ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి 27 న ప్రపంచ ఎన్ జీ ఓ ల దినోత్సవ వేడుకలు జరుపుకోవడం 2014 నుండి వస్తుందన్నారు. పేదరిక నిర్మూలనకు, అసమానతలు లేని సమాజ స్థాపనకు, మానవ హక్కుల పరిరక్షణ కోసం స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి మరువరానిదన్నారు. శ్రీకాకుళం జిల్లా ప్రగతిలో స్వచ్ఛంద సంస్థలు పాత్ర కీలకమని, గిరిజన ప్రాంతాల సమగ్రాభివద్ధికి ఇతోధికంగా కృషి చేస్తున్న సంస్థల సేవలు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్టార్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు గేదెల లక్ష్మీ, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గుడ్ల జగ్గారావు, గోర్ల వాసుదేవరావు, సోపెటి కొండలరావు, సుగంధం సంజీవరావు, ఎం.మల్లిబాబు, మెట్ట దనుంజయ బట్ల, తిరుపతిరావు పాల్గొన్నారు.

అసెంబ్లీ సాక్షిగా సూపర్ సిక్స్ పథకాలు వాయిదా..!

సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకులు హరనాథ్

విశాలాంధ్ర-పలాస: రాష్ట్ర ప్రగతిపై ఎన్డీఏ కూటమి రాసిచ్చిన సోత్కర్షపాఠాన్ని గవర్నర్ వాస్తవాలను గ్రహించకుండా గుక్కతిప్పుకోకుండా చదివారని సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్ విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల హామీలు నెరవేర్చలేదనేది చంద్రబాబు ప్రకటనలో స్పష్టమైందని హరినాథ్ తెలిపారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమంలో పిడిఎఫ్ ఎమ్మెల్యేలు వివరణాత్మకంగా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఉద్యోగ వర్గాలకు ,విద్యార్థులకు ఇచ్చిన హామీలు డీఎస్సీ ,జాబ్ క్యాలెండర్లు, ఓ.పి.ఎస్ అమలు నోచుకోలేదని సహేతుకంగా ప్రశ్నించారని హరినాథ్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలైనా 2026 వరకు తాము ఎన్నికల ముందు ప్రకటించిన పథకాలు అమలు చేయలేమని చేతులెత్తేసారన్నారు. 2026 జూన్ 12 నాటికి ఐదు లక్షల ఇళ్ల నిర్మాణం చేస్తామని రాబోయే విద్యా సంవత్సరం పాఠశాలల ప్రారంభించే నాటికి మెగా డీఎస్సీ ప్రకటిస్తామని ప్రకటించటం విడ్డూరంగా ఉందని హరినాథ్ ఎద్దేవా చేశారు. రైతులకు ఇస్తానన్న రైతు భరోసా ఇవ్వకుండా మిర్చి రైతులు ,మామిడి రైతులు సంక్షోభంలో ఉండగా రైతులు సుభిక్షంగా ఉన్నారని గవర్నర్ చెప్పటం వాస్తవాలను గ్రహించక పోవటమేనని హరినాథ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆదాయం పెంచుకోవడానికి పన్నులు విధించడంలో ఉన్న ఉత్సాహం ప్రజలకు రాయితీలు కల్పించడంలో ఉండదని గతంలో కూడా రుణాల రద్దు విషయంలో వాయిదాల పర్వం కొనసాగించి పూర్తిగా చెల్లించక పోవడం వలనే ప్రజలు ఇంటికి పంపారన్నారని గుర్తు చేశారు. కేంద్రం ఇచ్చే రైతు భరోసా 6,000 కు రాష్ట్ర ప్రభుత్వం 14,000 కలిపి 20,000 మూడు దఫాలుగా ఏ తేదీలోగా అందిస్తారో ప్రకటించాలని హరినాథ్ డిమాండ్ చేశారు. విజన్ 2047, "ఫోర్ పి"విధానాలు ఉగాది నుండి ప్రారంభించి రాష్ట్రాన్ని కార్పొరేట్లకు అభివృద్ధి జపంతో అన్ని రంగాలను ప్రైవేటుపరం చేసి (అప్పగించి) ప్రజలపై భారాలను వేయటానికి విజన్ల సృష్టికర్త చంద్రబాబు ఉత్సాహపడుతున్నారని," స్వర్ణాంధ్ర రుణాంధ్ర గా" మారనుందని హరినాథ్ విమర్శించారు.

పలాస డివిజన్‌లో 1061 ఓట్లు పోలింగ్

విశాలాంధ్ర-పలాస: పలాస డివిజన్ నందిగాం నుంచి ఇచ్ఛాపురం వరకు ఎనిమిది మండలాల పరిధిలో గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో 1104 ఓట్లుకు గానూ 1061 ఓట్లు పోలయ్యాయని రిటర్నింగ్ అధికారి పలాస ఆర్డిఓ జి. వెంకటేష్ తెలిపారు. పలాస మండలానికి సంబంధించి 280 ఓట్లకు గానూ 273 ఓట్లు పోలింగ్ జరిగి 96.8 శాతం, మందస మండలానికి సంబంధించి 178 ఓట్లకు గానూ 174 ఓట్లు పోలింగ్ జరిగి 93.8 శాతం, కంచిలి మండలానికి సంబంధించి 89 ఓట్లకు గానూ 83 ఓట్లు పోలింగ్ జరిగి 94.4 శాతం, ఇచ్ఛాపురం మండలంలో 111 ఓట్లకు గానూ 104 పోలింగ్ జరిగి 91.5 శాతం, కవిటి మండలంలో 94 ఓట్లకు గానూ 85 ఓట్లు పోలింగ్ జరిగి 97.7 శాతం, సొంపేట మండలంలో 176 ఓట్లకు గానూ 172 ఓట్లు పోలింగ్ జరిగి 89.7 శాతం, వజ్రపుకొత్తూరు మండలంలో 78 ఓట్లకు గానూ 76 ఓట్లు పోలింగ్ జరిగి 90.8 శాతంగా, నందిగాం మండలంలో 98 ఓట్లకు గానూ 94 ఓట్లు పోలింగ్ జరిగి 90 శాతంగా నమోదు అయ్యిందని ఆర్డీవో తెలిపారు. ఆర్డీఓ జి.వెంకటేష్, తహసిల్దార్ టి.కళ్యాణ చక్రవర్తిలు పోలింగ్ తీరును పరిశీలించారు. పోలింగ్ సమయంలో కాశీబుగ్గ సిఐ పి, సూర్యనారాయణ ఆద్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. రఘువర్మకు మద్దతుగా కూటమి నాయకులు వెంకన్నచౌదరి, వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, చౌదరి బాబ్జి , దువ్వాడ శ్రీకాంత్, రవిశంకర్ గుప్తా, చిన్ని, ఎన్నికల పరిశీలకులు రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి దిక్సూచి కళలు

టీవీ రంగస్థల నటుడు డాక్టర్ కుమార్ నాయక్

విశాలాంధ్ర-పలాస: కళలు సమాజానికి దిక్సూచి వంటివని, కళలతోనే సామాజిక చైతన్యం సాధ్యమవుతుందని టీవీ సినీ రంగస్థల నటుడు కుమార్ నాయక్, డా.తెప్పల కృష్ణమూర్తి, డా రామి నాయుడులు అన్నారు. జన జాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య నవ వసంతాల వేడుక సందర్భంగా బుధవారం రాత్రి కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఈ ప్రాంత కళాకారులకు కళల్లో జాగ్రత్త చేసేందుకే జన జాగృతి సంస్థ పుట్టిందని అన్నారు. కళాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సంస్థ ప్రయత్నిస్తుందని వారిని ప్రోత్సహిస్తున్నామని అన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలను ప్రదర్శించారు. 14 మందితో కూడిన అంధ కళాకారులచే స్వర రంజని కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ రంగస్థలం నటుడు రేజేటి బోసు బాబును నట కిరీటి బిరుదాంకితం చేసి ఘనంగా సన్మానించారు.

అలాగే 36 మంది పౌరాణిక జానపద సాంఘిక చారిత్రక కళాకారులను, సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా. తెప్పల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బందారు కాళిదాసు, గౌరవ అధ్యక్షులు ఎల్ వెంకటాచలం, తమ్మినేని మాధవరావు, కొత్తకోట భానుమూర్తి, శ్రీనివాస్ బాబ్జి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రిని పురష్కరించుకొని అన్నదానాలు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: శివరాత్రి ఉత్సవాలను పురష్కరించుకొని కోటబొమ్మాళి మండల కేంద్రంలో గల శివాలయం వద్ద సుమారు 5 వేలు మందికి భక్తులకు గ్రామ పెద్దలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలం తులసిపేట గ్రామంలో శ్రీ కాశి విశ్వేశ్వరస్వామి దేవాలయం వద్ద గ్రామస్థులు సుమారు 2 వేలు మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అద్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నాయకులు వెలమల కామేశ్వరావు, తర్ర రామక్రిష్ణ, నంబాళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోగల యలమంచిలి, దంత, కురుడు, తర్లిపేట, సౌదం, జర్జంగి శివాలయ అవరణలో గ్రామస్థులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

97.43 శాతం ఓటింగ్ నమోదు

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు: మండలం వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంగా గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్యే ఎన్నికలలో 78 మందికి గాను 76 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 97.43 శాతం

ఓటింగ్ నమోదయినట్లు అధికారులు చెప్పారు. 16 మంది మహిళా ఓటర్లుకు గాను 16 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 62 మంది పురుష ఉపాధ్యాయులుకు గాను 60 మంది ఓటింగ్లో పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రానికి పలాస ఆర్డిఓ గ్రంధి వెంకటేష్ తాహిల్దార్ సీతారామ్మూర్తి, ఎంపిడిఓ ఎన్.రమేష్నాయుడు, కాశీబుగ్గ రూరల్ సిఐ తిరుపతిరావు, వజ్రపుకొత్తూరు ఎస్ఐ బి.నిష పరిశీలన చేసి ఏలాంటి అవాంచణీయ సంఘటనలు లేకుండా చూసారు. యూటీఎఫ్, టిడిపి, నాయకులు శిబిరాలను ఏర్పాటు చేశారు. యూటీఎఫ్ నాయకులు జయరాం,ధర్మారావు, సీపీఎం నాయకులు బమ్మిడి అన్నదరావు తదితరులు పాల్గొన్నారు. టిడిపి శిబిరాన్ని టిడిపి పలాస సమన్వయకర్త వెంకన్న చౌదరి సందర్శించారు.టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహన్ రావు,కర్ని రమణ, నెయ్యల సూర్యనారాయణ,దున్న షణ్ముఖ రావు, గోవింద పాపారావు తదితరులు ఉన్నారు.

తహసిల్దార్ కార్యాలయం పనితీరు భేష్

విశాలాంధ్ర-పలాస: పలాస తహసీల్దార్ కార్యాలయంలో గతంలో పనిచేసిన తహసిల్దార్ కన్నా ప్రస్తుతం పని చేస్తున్న తహసిల్దార్ టీ. కళ్యాణ్ చక్రవర్తి మెరుగైన సేవలు అందించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఈ కార్యాలయంపై గతంలో వచ్చిన ఆరోపణలు చక్కదిద్ది ఎటువంటి విమర్శలకు తావివ్వకుండా మెరుగైన పాలన అందించడానికి చర్యలు చేపడుతున్నారు. పౌర సేవలు అందించడంలో పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారని దరఖాస్తుదారులు తెలుపుతున్నారు. ఆయన పై వస్తున్న విమర్శలను లెక్కచేయకుండా ప్రభుత్వ భూ ఆక్రమణదారులపై కొరడా ఝుళిపిస్తున్నారు. అక్రమాలకు గురి అయిన ప్రభుత్వ స్థలాలు ప్రభుత్వ ఆధీనంలోకి తెచ్చేందుకు తన వంతుగా కృషి చేయడంతో పాటు రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా తన కార్యాలయం ద్వారా పౌర సేవలు అందించడంలో ముందుకు దూసుకుపోతున్నారని పలువురు తెలుపుతున్నారు. ఐదేళ్ల క్రితం పలాస తహసిల్దార్ గా వ్యవహరించిన కళ్యాణ చక్రవర్తికి ఈ ప్రాంతంలో గల సమస్యలను పరిష్కరించే సమయంలో టెక్కలి ఆర్డీవో కార్యాలయంలో ఏ వో గా బదిలీపై వెళ్లారు. ఐదేళ్ల తర్వాత తిరిగి పలాస తహసిల్దార్ గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వెంటనే తనదైన మార్కుతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పలువురు అంటున్నారు. సచివాలయముల ద్వారా వస్తున్న ప్రతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడం తో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పిసిఎంఎ ఎన్నికల్లో 8 నామినేషన్లు

విశాలాంధ్ర-పలాస: పలాస పిసిఎంఎ (పలాస క్యాష్యు మ్యానిఫేక్చరర్స్ అసోషియేషన్) ఎన్నికలకు సంబంధించి నూతన కార్యవర్గం ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వగా గురువారం నాటికి నామినేషన్ పక్రియ పూర్తయినప్పటికి 8 మంది సభ్యులు నామినేషన్ వేశారని ఎన్నికల కమిటీ సభ్యులు తెలిపారు. మార్చి 4వ తేది నిర్వహించే ఎన్నికలకు నామినేషన్ దాఖలకు 25,26,27 తేదిలుగా నిర్వహించగా బుధవారం నలుగురు సభ్యులు నామినేషన్ దాఖలు చేయగా, గురువారం మరో నలుగురు నామినేషన్లు దాఖలు చేయగా మొత్తం 8 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లయింది. వీరిలో అధ్యక్ష పదవికి మల్లా శ్రీనివాసరావు, మల్లా సురేష్ లు, కార్యదర్శి కై టంకాల రవిశంకర్ గుప్తా, కె.వి.శివక్రిష్ణలు, కోశాధికారి పదవికి చుండూరు మహేశ్వరరావు, సిందిరి సతీష్ కుమార్, మల్లా సంతోష్ కుమార్ లు నామినేషన్లు దాఖలు చేశారు.ఎన్నిక కమిటి సభ్యులు బెల్లాల నారాయణరావు, తర్లాన రమేష్ కుమార్, మల్లా భాస్కరరావులు వీరి వద్ద నుంచి నామినేషన్లు స్వీకరించారు. శుక్రవారం నామినేషన్లు స్క్రూటినీ , తిరస్కరణలు అనంతరం మార్చి 4వ తేదిన ఎన్నికలు నిర్వహించనున్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం జగతి పీడర్ పరిధిలో 11 కేవీ లైన్లో మరామత్తులు,జంగిల్ క్లీరెన్స్ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు లండారిపుట్టుగ,శిలగాం పంచాయతీల పరిధిలోని గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగునని గృహ వినియోగాదరులు, వ్యవసాయ విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని విద్యుత్తు శాఖ ఈఈ యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

దర్జీ బతుకుల్లో దర్జా మాయం

సంక్షోభంలో దర్జీల బతుకులు

నేడు టైలర్ల దినోత్సవం

విశాలాంధ్ర-పలాస: వస్త్రాలు మనిషికి అందం.హుందాతనం...విలువ... ఆకర్షణ కలిగిస్తాయి. వస్త్రానికి ఆకృతినిచ్చి కళాత్మకంగా తీర్చిదిద్దే నైపుణ్యం దర్జీల సొంతం. రెడీమేడ్ వస్త్రాలను కూడా దర్జీలే కుట్టినా ఇష్టమైన రంగు, ఇష్టమైన వస్త్రంతో సరి పోయే కొలతలతో కుట్టించుకునే వస్త్రాలను వేసుకుంటే ఆ అనుభూతి వేరు. ఈ నేపథ్యంలో మార్కెట్లోకి వస్తున్న కొత్త కొత్త ఫ్యాషన్లకు అనుగుణంగా బట్టలు కుట్టే నేర్పు ఉన్నా... రెడీమేడ్ దుస్తుల వలన టైలర్లకు ఆదరణ పూర్తిగా తగ్గుతూ వస్తోంది. పండుగలు, శుభకార్యాల సమయంలో వారికి చేతినిండా పని ఉండేది. కొత్త దుస్తులు కుట్టించుకునేందుకు టైలర్ల వద్దకు క్యూ కట్టేవారు. టైలర్ వృత్తి రోజు రోజుకు అనేక మార్పులకు గురవుతూ వచ్చింది. ఇప్పుడు ఫ్యాషన్ టెక్నాలజీలో భాగంగా మారింది. పాత కుట్టుమిషన్ల స్థానంలో అత్యాధునిక మిషన్లు వచ్చి చేరాయి. కంప్యూటర్ల ప్రవేశంతో ఎలాంటి డిజైన్ అయినా అలవోకగా తీర్చిదిద్దే ఆధునిక విజ్ఞానం అందుబాటులోకి వచ్చేసింది. అయితే రెడీమేడ్ వస్తువుల రాకతో టైలర్ వృత్తి సంక్షోభంలో కూరుకుపోతోంది. ఫ్యాషన్ డిజైన్ మోజులో పడి టైలర్ ను పట్టించుకునే వారు గణనీయంగా తగ్గిపోయారు. శుక్రవారం " ప్రపంచ టైలర్స్ డే" దే సందర్భంగా దర్జీలపై ప్రత్యేక కథనం...

టైలర్ షాపులు వెలవెల....:

గ్రామ స్థాయి నుంచి నగరం వరకు ప్రతి చోటా టైలర్లు ఉన్నారు. షాపుల ద్వారా కొందరు.. ఇళ్లల్లోనే మరి కొందరు వస్త్రాలు కుడుతుంటారు. జిల్లాలో దాదాపు పది వేల మంది దర్జీ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రెడిమేడ్ దుస్తులు తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చేస్తుండడంతో వస్త్రం తీసుకుని, టైలర్ల వద్ద కొలతలు ఇచ్చి కుట్టించుకునే వారు తగ్గిపోయారు. దుస్తులు కుట్టించుకునేందుకు ఎవరు వస్తారా అని టైలర్లు ఎదురుచూసే పరిస్థితులు వచ్చాయి. వినియోగదారులే లేక షాపులు వెలవెలబోతున్నాయి. సొంత షాపులు ఉన్న వారు ఎలాగోలా నెట్టుకొస్తుండగా.. మిగిలిన వారు కుటుంబ పోషణతో పాటు అద్దెలు చెల్లించేంత సంపాదలేక బతుకీడుస్తున్నారు.

నాడు 'చేదోడు'తో బాసట :

కష్టాల్లో నలిగిపోతున్న టైలర్లను గత వైసీపీ ప్రభుత్వం ఆదుకుంది. టైలర్ల కోసం 'జగనన్న చేదోడు' పథకంతో ఆర్థిక భరోసా కల్పించింది.ప్రతి టైలర్ కూ ఏడాదికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచింది. జిల్లాలో టైలర్లు అందరూ నాలుగేళ్ల పాటు లబ్ధి పొందారు. ఈ పథకం కొద్దిమేర టైలర్ల జీవనోపాధికి వెసులుబాటు కల్పించింది. అంతేకాక ప్రతి విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫాం క్లాత్ లను ప్రభుత్వం అందించి, కుట్టు కూలి సొమ్మును తల్లుల ఖాతాల్లో జమ చేస్తూ వచ్చేది. యూనిఫాం ఇవ్వకుండా క్లాత్ మాత్రమే ఇవ్వడంతో ఒక రకంగా టైలర్లకు పని లభించేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తమ సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని దర్జీలు వాపో తున్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక

– పోలింగ్ తీరు పరిశీలించిన ఎంఎల్ఏ కూన

విశాలాంధ్ర- ఆమదాల వలస: ఆముదాలవలస లో ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రాంతంగా జరిగింది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రశాంతంగా జరిగాయి.ఎన్నికల ప్రారంభం నుంచి ఉపాధ్యాయ సంఘాల నేతృత్వంలోని ఉపాధ్యాయ వారి ఓటు హక్కు ను వినియోగించుకున్నారు.11 గంటల సమయంలో జిల్లా కలెక్టర్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల సజావుగా సాగేందుకు సహకరించాలని అన్నారు. ఉదయం నుండి జరిగిన పోలింగ్ లో ఉపాధ్యాయ ఓటర్లు చురుగ్గా పాల్గొని సాయంత్రం ఓటింగ్ ముగిసే సమయానికి 93 శాతం పూర్తయింది. నియోజకవర్గంలోని నాలుగు కేంద్రాల్లో 639 ఓట్లు ఉన్నాయి. ప్రశాంతంగా పోలింగ్ ముగిసి అత్యధిక శాతం నమోదు చేసుకుంది. ఇది ఇలా ఉండ గా ఉపాధ్యాయ సంఘాలు ఏర్పాటు చేసిన శిబిరా లకు స్థానిక ఎమ్మెల్యే పియూసి ఛైర్మన్ కూన రవికు మార్ హాజరై పోలింగ్ సరళని పరిశీలించారు. అలాగే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలు సుకున్నారు. పొందూరు, బూర్జ, ఆముదాలవలస సరుబుజ్జిలి మండలాల్లో జరిగే ఎన్నికల్లో పాల్గొని ఉపాధ్యాయులతో ఓటింగ్ సరళి అడిగి తెలుసు కున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు సహ కరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఆయనతో పాటు మండలాల్లోని నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో మందస రైల్వేస్టేషన్

విశాలాంధ్ర-మందస: మందస రైల్వేస్టేషన్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది.దశాబ్దాలు తరబడి రైల్వే స్టేషన్ అభివృద్ధి, సమస్యలపై ప్రయాణికులు రైల్వే ఉన్నతాధి కారులకు వినతిపత్రాలు అందజేస్తున్నప్పటికి హామీలే తప్ప స్పందన లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ స్టేషన్ ద్వారా రైల్వే శాఖ కు ఆదాయం వస్తున్నప్పటికీ స్టేషన్ అభివృద్ధి కోసం తీసుకున్న చర్యలు శూన్యంగా కనిపిస్తున్నాయి. వివరాలు ఇలా వున్నాయి. ఈ రైల్వేస్టేషన్ లో నాలుగు ప్లాట్ ఫామ్ లు ఉన్నాయి.ఈ ప్లాట్ పామ్స్ పొడవున ప్రయాణికుల నీడ కోసం షెడ్డులు లేవు.కేవలం రెండు ప్లాట్ పామ్స్ వద్ద మాత్రమే రెండు చిన్న షెడ్డులు ఉన్నాయి.ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు రైళ్లు ద్వారా ప్రయాణం చేసే ప్రయాణికులు ఎండలో నిల్చొని, వానలో తడవాల్సిందే .ప్లాట్ పామ్స్ పై ఉన్న తాగునీరు పైపులైన్ పనిచేయదు.తాగు నీరు కుళాయిలు పని చేయవు.ఒక ప్లాట్ ఫామ్ వద్ద ఉన్న మరుగు దొడ్లు,మూత్ర విసర్జన శాలలు పరిశుభ్రం లేక పూర్తిగా గదులకు తాళాలు వేసారు.వికలాంగుల కోసం నిర్మించిన మరుగు దొడ్లు వారికి అందుబాటులో ప్లాట్ పామ్స్ పై నిర్మించ కుండా స్టేషన్ కు సంబంధం లేకుండా ఆరు బయట నిర్మించారు.దీంతో అత్యవసర సమయాల్లో వికలాంగులు, ప్రయాణికులకు మరుగుదొడ్లు మూత్ర విసర్జన శాలలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు .ముఖ్యంగా మహిళలు అనేక అవస్థలు పడుతున్నారు.రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్, రిజర్వేషన్ కౌంటర్ స్టేషన్ లోనే ఉన్నాయివీటిని స్టేషన్ ప్రవేశ ద్వారానికి ముందు భాగాన ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని అంటున్నారు. ఇక్కడ సి సి కెమెరాలు ఏర్పాటు చేయక పోవడంతో తరచూ ప్రయాణికుల ద్విచక్ర వాహనాలు దొంగలు పాలవుతున్నాయి.ప్లాట్ ఫామ్ లు ఇక్కడ ప్రయాణికులకు అనుకూలంగా ఎత్తుగా ఉన్నప్పటికీ ఎక్స్ప్రెస్,సూపర్ ఫాస్ట్ రైళ్లు నిలుపుదల సక్రమంగా లేవు.ప్రతి రోజూ ఇక్కడ భువనేశ్వర్ టు విశాఖపట్నం ఇంటర్ సిటీ ,పూరీ టు తిరుపతి ఎక్సపేస్ మాత్రమే నిలుపుదల చేస్తుంటారు.మరి ఏ ఇతర ఎక్స్ప్రేస్,సూపర్ ఫాస్ట్ ట్రెయిన్లు ఇక్కడ నిలుపు దల ఉండవు.బరంపురం నుంచి విశాఖపట్నం వెళ్ళే పాసింజరు ఉదయం 4:30 గంటలకు ఉంది.మిగతా పాసింజరు సర్వీసులు నామ మాత్రంగా పలాస . మందస మీదుగా ఒడిస్సా రాష్ట్రానికి వెళ్తుంటాయి.దూర ప్రాంతాలకు గాని ,ఇతర రాష్ట్రాలకు ఇక్కడ నుంచి ప్రయాణం చేయాలంటే ప్రజలు కోరుతున్న విధంగా ఇక్కడ నుంచి రైళ్ల సౌకర్యం లేదు.ప్రయాణికులు వాహనాలు నిలుపుదల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలం లేదు.ఇక్కడ తత్కాల్ టికెట్ల కోసం కోటా తక్కువగా కేటాయించారు.సాంకేతికపరమైన లోపాలు అధిగమిం చేందుకు వ్యవస్థను ఆధునీకరించి తత్కాల్ కోటాను పెంపుదల చేయాలి.ఇక్కడ విశేషమేమిటంటే కేవలం రైల్వే ఉద్యోగులకు మాత్రమే స్టేషన్ లో తాగునీరు ,మరుగు దొడ్లు,సౌకర్యం ఉండడం విశేషం.స్టేషన్ ప్లాట్ ఫాం లపై విద్యుత్ వెలుగులు కూడా ఉండవు. స్టేషన్ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న బల్బులు కాలిపోయినా కొత్తగా బల్బులు బిగించరు. పై నడక వంతెన మొత్తం మీద విద్యుత్ వెలుగులే పూర్తిగా ఉండవు.రైల్వే స్టేషన్ లో ప్రయాణికులకు సమస్యలు ఇలా ఉంటే రైల్వే ఉద్యోగుల నివాస గృహాలు(క్వార్టర్లు)శిథిలావస్థకు చేరుకున్నాయి. దశాబ్దాలు తరబడి శిథిలావస్థలో ఉన్నప్పటికీ వీటి

స్థానంలో కొత్త భవనాలు నిర్మించడం లేదు.ఉద్యోగుల క్వార్టర్లలో మౌలిక సదుపాయాలు పూర్తిగా లేవు.ఇప్పటికీ అయిన స్టేషన్ అభివృద్ధి కి రైల్వేశాఖ మంత్రి ,రైల్వేడివిజన్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. స్టేషన్ అభివృద్ధి కి చర్యలు తీసుకోవాలని ఎస్.సి.సి సభ్యులు రౌతు చిరంజీవి ఇప్పిలి వెంకట రావులు మాట్లాడుతూ మందస రైల్వే స్టేషన్ కు తనిఖీలు నిమిత్తం తరచూవస్తున్న పలువురు రైల్వే ఉన్నతాధి కారులకు .స్టేషన్ అభివృద్ధి కోసం ప్రయాణికులు సౌకర్యార్థం పలు రకాల రైళ్లు నిలుపుదల కోసం వినతి పత్రాలు అందిస్తున్నా ,హామీలతో కాలం గడుపు తున్నారే తప్ప పరిష్కారం మాత్రం శూన్యం.రైల్వే శాఖ మంత్రి కూడా వినతి పత్రాలు పంపిస్తున్నప్పటికి స్పందన కరువవుతోంది. ఈ ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతున్నందున రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించు కోవాలని లేకపోతే ఈ ప్రాంతం ప్రజలతో ఆందోళన కార్యక్రమాలు త్వరలోనే చేపడతామని హెచ్చరించారు.

సబ్ రిజిస్ట్రార్పై సస్పెన్షన్ వేటు

విశాలాంధ్ర-టెక్కలి సబ్ రిజిస్ట్రార్ ఎం.ఉమామహేశ్వరరావుపై గురువారం సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ఆయనను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గత కొంతకాలంగా టెక్కలి సబ్ రిజిస్ట్రార్కార్యాలయంలో జరుగుతున్న కార్యకలాపాల పై ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ఆయన సస్పెండ్ కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ ఏ.నాగలక్ష్మి ప్రస్తావించగా సస్పెండ్ అయినట్లు స్పష్టం చేశారు.

ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : స్థానిక కాదాలక్ష్మీకాంతం మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు 10వ నెంబర్ పోలింగ్ కేంద్రాన్ని సహాయ రిటర్నింగ్ అధికారి తహశీల్దార్ వెంకట్రావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభించారు. మొత్తం 111మంది ఓటర్లకు గాను 104మంది ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా 94%పోలింగ్ నమోదైందని తహశీల్దార్ తెలిపారు. 38మంది మహిళలు, 66మంది పురుష ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌ను అటు ఉపాధ్యా సంఘాలు, అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పోలింగ్ సమయంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఇన్‌స్పెక్టర్ ఎం. చిన్నంనాయుడు ఆధ్వర్యంలో సబ్ ఇన్‌స్పెక్టర్& ముకుందరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

గంజాయి రవాణా ముఠా అరెస్ట్

తమ్ముడి విడుదల కోసం గంజాయి రవాణా

ఎస్డీపీఓ వెంకటప్పారావు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మత్తు పదార్థాల రవాణా ద్వారా సంపాదనకు మార్గాలు వెతుక్కుంటున్న గిరిజన ప్రాంతాలకు చెందిన యువత గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నిందుతులుగా మారుతున్నారు. కాశీబుగ్గ సబ్ డివిజినల్ పోలీస్ అధికారి వెంకటప్పారావు గురువారం వెల్లడించిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం. చిన్నంనాయుడు, సబ్ ఇన్‌స్పెక్టర్ ముకుందరావులతో కలిసి వెల్లడించిన వివరాల మేరకు 47.480కిలోల గంజాయి రావాణాకు పాల్పడిన ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. జనవరి నెలలో గంజాయి రావాణా కేసులో అరెస్ట్ అయిన తన తమ్ముడిని బెయిల్ పై విడిపించుకునేందుకు అవసరమైన డబ్బులు సంపాదనకు మిఖయిల్ సబర్ మరి కొంత మంది స్నేహితులతో కలిసి ఓ ముఠాగా ఏర్పడి గంజాయి రవాణా మార్గాన్ని ఎంచుకున్నాడు. కొండ ప్రాంతాల్లో కిలో 2వేలకు కొని కేరళలోని రాయంకులమ్ ప్రాంతానికి చెందిన దుర్గకు అవసరమైన గంజాయిని అందివ్వడం ద్వారా కిలోకు 8వేలు దక్కించుకోవడానికి మొహనా బ్లాక్ గోవిందపూర్‌కు చెందిన మిఖయిల్ సబర్ పథకం సిద్ధం చేసుకున్నాడు. గంజాయిని కొని దాన్ని ఒక సూట్‌కేస్, 6లగేజీ బ్యాగుల్లో ఉంచి తన బావ మరిదితో పాటు మరో నలుగురితో కలిసి బరంపురం మీదుగా ఇచ్ఛాపురం చేరుకుని రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా పట్టణ పోలీసులు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. మిఖయిల్ సబర్ (28), ప్రకాష్ గమాంగ(29), సమంత సబర్ (21) సుకుంత సబర్(20), టొట గమాంగ(28), బబుల గమాంగ (27)లను అదుపులోకి తీసుకున్నామని కేసు నమోదు చేసి వారి నుండి 7మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని డిఎస్పీ వెల్లడించారు.